''వెరీ నైస్ చిట్టీ. మీ ముగ్గురి పేర్లు చెప్పావ్. మరి అమ్మ పక్కన..'' అతని మాట పూర్తికాకముందే సుజాత కల్పించుకుంది.

''సిట్టీ.. గీ దుప్పటి తాతకియ్యవే! సలైతాంది. నువ్ అడ్డే కూసో. సీట్ పోతే పరేషాన్ అయితది''.

ఆమె మాటలు డా.రావుకు అసహజంగా అనిపించాయి. తాతయ్యకు నిజంగా దుప్పటి ఇవ్వడానికి కాకుండా.. సంభాషణను మరల్చడానికి అలా అన్నట్టుగా అనిపించింది.

ట్రైన్ పెద్దపల్లి స్టేషన్‌లో ఆగింది. డా.రావు క్యాంటీన్‌కు వెళ్లి, పది నిమిషాల్లో తిరిగొచ్చాడు. అతని చేతిలో ఐదు ఇడ్లీ ప్యాకెట్స్, వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ ఉన్నాయి.

''పోచయ్యా.. తీస్కో!'' అంటూ పోచయ్యకూ, చిట్టికి, సుజాతకూ ఒక్కో ఇడ్లీ ప్యాకెట్ ఇచ్చాడు డా.రావు.

వాటితోపాటే రెండు వాటర్ బాటిల్స్, ఒక కూల్‌డ్రింక్ బాటిల్ కూడా ఇచ్చాడు. చిట్టీ, పోచయ్య మారుమాట్లాడకుండా తీసుకున్నారు. సుజాత మాత్రం ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది. అంతలోనే తేరుకొని..

''గిదేంది సార్? మీ కొరకు దెచ్చుకున్నవి మాకు ఇస్తున్రు? అద్దు సార్.. మీరే తీస్కోండ్రి. బండిల అమ్మేటోళ్లు అచ్చినంక మేం గూడ దీస్కుంటం!'' అంటూ, తిరిగి ఇవ్వబోయింది.

''ఒక్క నిమిషం! ఈ రోజు మా బన్నూ బర్త్‌డే. ఇంట్లో ఉంటే అందరికీ చాక్లెట్స్, కేకులు, స్వీట్స్ పంచడం.. అన్నీ ఉంటాయ్. కానీ, అర్జెంట్ ప్రయాణమని చెప్పాను కదా. మా పాప సంతోషం కోసం కేకు, స్వీట్స్ బదులు ఇవి ఇస్తున్నాను. మీరు తీసుకోకపోతే మేం ఇద్దరం బాధ పడతాం''.. నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు డా.రావు.




ట్రైన్ పెద్దపల్లి నుంచి బయల్దేరింది.

సుజాత ఇంకా తటపటాయిస్తూనే ఉంది.

''ఇక్కడ మీరు, మేం తప్ప ఇంకెవరూ లేరు కదమ్మా! ఇంకో విషయం చెప్పనా? ఇది సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్. పైగా రాత్రి. ఈ బండిలో అమ్మేవాళ్లు రారు. ఇంకేం ఆలోచించకు.. తీస్కో!'' అన్నాడు డా.రావు.

అతని మాటలకు సుజాత సమాధాన పడింది. అన్యమనస్కంగానే అతనిచ్చినవి తీసుకుంది. బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పాలో చెప్పకూడదో.. ఎలా చెప్పాలో తెలీక, బన్నూ వైపు ప్రేమగా నవ్వుతూ చూసింది సుజాత.

''నాన్నా.. ఇన్ని రోజులూ నా బర్త్‌డే జులై 9 అనుకున్నాను. సరే.. ఇంక ఇప్పటినుంచి ఫిబ్రవరి 6కే చేసుకుంటాలే!''.. రావు చెవిలో మెల్లగా అన్నది బన్ను. ఆమె సూక్ష్మం గ్రహించినందుకు చిన్నగా నవ్వుకున్నాడు.

డా.రావు, బన్నూ ఇడ్లీలు తిన్నారు. వారితోపాటే చిట్టి, పోచయ్య కూడా తిన్నారు. సుజాత గిల్టీగా ఫీలవుతున్నట్టు గ్రహించాడు రావు. ఆమె తినకుండా ప్యాకెట్‌ను తన పక్కన పెట్టుకుంది.

''మా అందరిదీ అయిపోయింది. చల్లగా అవ్వక ముందే టిఫిన్ తింటే బాగుంటుంది కదా!''.. సుజాతతో అన్నాడు డా.రావు.

''అలాగే సార్.. తింటాను'' అన్నది సుజాత.

''దర్శనానికి వెళ్తున్నారా తిరుపతికి?''.

''లేదు సార్. మా ఆయన దగ్గరికి పోతున్నం!''.

''అవునా! ఎక్కడ ఉంటాడు మీ ఆయన?''.

''సింతామనిలో సార్''.

''ఏం పనిచేస్తాడు అక్కడ?''.

''రాళ్లు కొట్టేడిది. గ్రానైట్‌లో సార్''.

''మదనపల్లి నుంచి బెంగుళూర్ వెళ్లే దారిలో వస్తుంది.. ఆ చింతామణేనా?''.

''అవును సార్.. గదే! మీకు దెల్సా సార్?''.

''మదనపల్లి మా అత్తగారి ఊరు. అలా తెలుసు. చూసి రావడానికి అందరూ కలిసి వెళ్తున్నారా?''.

''లేదు సార్.. అడ్నే ఉండేటందుకు పోతున్నం. ఆయన అచ్చిపోయేటందుకు తిప్పలైతాంది. మస్తు కిరాయిలైతున్నయ్. గిట్ల కాదని అడ్నే రూము జూసిండు''.

''అదే మంచిది. బయటి తిండి తినాలన్నా ఖర్చు ఎక్కువే అవుతుంది. దానికి తోడు అనారోగ్యం. ఇప్పుడైతే మంచైనా చెడైనా ఒకరికొకరు తోడుంటారు. ఉన్నదేదో కలిసి తింటారు!''.

''అవును సార్.. గందుకే పోతన్నం!''.

సుజాతలో ఏదో తెలీని ప్రత్యేకత కనిపిస్తున్నది డా.రావుకు. ముప్పై ఏళ్లలోపు వయసున్న పేద యువతి. చామనఛాయ. నుదుట కుంకుమ. కళ్లకు కాటుక. చేతులకు మట్టిగాజులు. కాళ్లకు పట్టీలు. మెడలో పసుపుతాడు. తలలో పూలు. కట్టింది పాత చీరే అయినా.. ఆ కట్టూబొట్టు ఎంతో హుందాగా, సంప్రదాయంగా ఉన్నాయి. నడకలో అణకువ. మాటలో ఒద్దిక. కళ్లల్లో ఆత్మవిశ్వాసం. ప్రతి కదలికలో ఆత్మీయత. ఆమె అణువణువులో ఆత్మాభిమానం. వెరసి సంపూర్ణమైన ఓ తెలుగు పల్లెపడుచు. నిండైన ఓ అమ్మ. అయిదోతనానికి అసలైన చిరునామా. డా.రావుకు చాలా ముచ్చటేసింది. సుజాతను చూస్తుంటే ఆమెపైన ఒక గొప్ప అభిమానం, గౌరవ భావం ఏర్పడ్డాయి అతనిలో.

* * *

డా.రావు ఆమెను నిశితంగా పరిశీలించాడు. ఆమె తనమీద కానీ, కూతురు మీద కానీ, మామగారి మీద కానీ, లగేజీ మీద కానీ అంతగా దృష్టి పెట్టడం లేదు. ఆమె ధ్యాసంతా బెర్త్‌పైన పడుకోబెట్టిన చిన్నారి మీదనే ఉంది. చీమ చిటుక్కుమన్నా క్షణాల్లో స్పందిస్తున్నది. ఆ బిడ్డపై ఈగను కూడా వాలనివ్వడం లేదు. డా.రావు సుజాత గురించి తెలుసుకొనే మరో సంఘటన అప్పుడే మొదలయ్యింది. అది జనరల్ కంపార్ట్‌మెంట్ కావడంతో ఈగలు ఎక్కువగా ఉన్నాయి. అవన్నీ మూకుమ్మడిగా కంకణం కట్టుకొని.. ఆ అమ్మ అమ్మతనాన్నే పరీక్షిస్తున్నట్టు ఆ బిడ్డపైన వాలడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. పాత న్యూస్ పేపర్‌తో గాలి వీస్తూ, చిన్నారి మీద ఈగలు వాలకుండా చూస్తున్నది సుజాత.

మందగమనంతో తిరుగుతున్న ఒక పంఖాలా, ఒక యంత్రంలా ఆమె చెయ్యి అలుపులేకుండా అలా పేపర్‌ను ఊపుతూనే ఉన్నది. ఆ ప్రయత్నంలో అనుకోకుండా ఆమె చేతిలోని పేపర్ కొన.. చిన్నారి మీద కప్పిన లుంగీకి తగిలింది. చిన్న శబ్దం. బిడ్డలో లిప్తపాటు చిన్న కదలిక. అంతే.. సుజాత ఉలిక్కిపడింది. ఆమె కళ్లలో ఆందోళన. తాను ఏదో తప్పు చేసినట్టు, తనను తాను నిందించుకుంటున్నట్టు ఆమె ముఖ కవళికలు చెప్పకనే చెప్తున్నాయి. తన ముద్దుల బిడ్డ ఉలిక్కిపడేలా చేసిన పేపర్‌ను క్షమించలేక.. అలా అని శిక్షిస్తే వచ్చే గరగర శబ్దంతో తన గారాల పట్టికి నిద్రాభంగం కలిగించలేక.. చేష్టలుడిగి చూస్తుండి పోయింది. పేపర్‌ను సీట్ కిందికి నెట్టేసింది.

సుజాత క్షణకాలం తత్తరపాటుకు లోనుకావటాన్ని ఈగలు అవకాశంగా తీసుకున్నాయి. తమ దాడికి అదునుగా మార్చుకుని.. విశ్వామిత్రుడి యజ్ఞాన్ని భగ్నం చేస్తున్న రాక్షసుల్లా, చిన్నారికి ఇబ్బంది కలిగించడానికి ఝుమ్మని రొదచేస్తూ, ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

దాంతో సుజాత తన చేతినే ఆయుధంగా చేసుకుంది. కుడి అరచేతిని విసనకర్రలా ఊపుతూ, ఈగలు వాలకుండా బిడ్డను కాపాడుతున్నది.

రాత్రి పది గంటలైంది. ట్రైన్ వరంగల్ దాటింది. డా.రావు కిటికీ దగ్గర కూర్చొని, మిగిలిన సీట్‌లో బన్నును పడుకోబెట్టాడు. ఎదురు సీట్ మీద పసిబిడ్డ, సుజాత. పోచయ్య సింగిల్ సీట్లో అలాగే నిద్రపోయాడు. అతని ఎదురు సీట్లో చిట్టి ముడుచుకొని పడుకున్నది.

''బిడ్డను అటువైపు జరిపి నువ్వు కూడా పడుకోవచ్చు కదమ్మా!''.. సుజాతకు సలహా ఇచ్చాడు డా.రావు.

''అయ్యో.. అద్దు సార్. జాగ సరిపోదు. బిడ్డ నలిగిపోతది. పోనీ కింద బట్టపరిసి పండ బెడుదామంటే.. అందరు నడిసిన్రు గదా. మంచిగ ఉండది. బీమార్ అయితది!'' చెప్పింది సుజాత.

''పోనీ.. వేరే చీరతో ఉయ్యాల కట్టి పడుకోబెట్టవచ్చు కదా?'' మరో సలహా ఇచ్చాడు అతను.

''అమ్మో.. గాలికి ఒక్కోసారి ఉయ్యాల చెక్కలకు గుద్దుకుంటాది సార్. గదింకా పరేషాన్!''.

డా.రావు ఇంక ఏమీ అనలేకపోయాడు.

సుజాత గురించే ఆలోచిస్తున్నాడు డా.రావు.

'ఎంత మంచి అమ్మ! అసలు అమ్మ అంటేనే మంచిది. కానీ ఈమె మంచి అమ్మల్లోనే మరీ మరీ మంచి అమ్మలా ఉంది!' అనుకున్నాడు.

సుజాత ప్రేమను ఇంతగా పొందుతున్న ఆ పసిబిడ్డ అదృష్టానికి ముచ్చటేసింది. ఆ చిన్నారి భాగ్యశాలిని, అదృష్టవంతుణ్ని ఒకసారి చూడాలనిపించింది అతనికి. ఇప్పుడు కాదు.. సుజాత ఈగలతో యుద్ధం చేసిన తీరు చూసినప్పుడే అతనికి ఆ ఆశ కలిగింది. కానీ, చూసే అవ